
# ఆలంబనే




## కోపూరి పుష్పాదేవి

అర్ధరాత్రి. పెనుమాయ లాగా చీకటి ప్రపంచాన్ని కమ్మేసిన వేళ. పగలంతా అలసిన జనం కమ్మటి నిద్రను అనుభవిస్తున్నారు. ఆ ఆసుపత్రి కామన్ రూమ్‌లో జీరో క్యాండిల్ నీరసంగా వెలుగుతోంది.

రామూర్తి మంచమ్మీద అసహనంగా కదులుతున్నాడు. ఆయనకు ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టడం లేదు. వేదన... అంతు లేని వేదన... ఇక తన బతుక్కి మిగిలింది ఈ వేదనే నేమో... నిట్టూర్చాడు ఆయన. నీరసంగా "పార్వతీ, పార్వతీ" అంటూ పిలిచాడు.

మంచం పక్కన చాప మీద ముడుచుకు పడుకున్న పార్వతి పలుకలేదు. పలుకలేదు అనడం కన్నా వినపడలేదు అంటే బాగుంటుంది.

ఎక్కడో నూతిలో నుండి వస్తున్నట్లుంది ఆ పిలుపు బలహీనంగా, దయనీయంగా. ఆమె పలుకక పోవడంతో ఉన్న ఓపికంతా కూడట్టుకుని మళ్లీ పిలిచాడు. ఫలితం శూన్యం. ఆమె మంచి నిద్రలో ఉంది. ఫ్యాను తిరుగుతున్నా ఉక్క పోస్తోంది. దోమలు వాటి హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకుంటున్నాయి. ఎన్నాళ్ల తర్వాత పట్టిన నిద్రో అది ఆమెకు. రామ్మూర్తి గారికి జరిగిన యాక్సిడెంట్లో వెన్నెముకకి తగిలిన దెబ్బ వల్ల, కాళ్లూ, చేతులూ చలనం కోల్పోయాయి. మందుల వల్ల శరీరబాధలు పెద్దగా లేకున్నా, మానసిక వ్యథ ఆయన్ని పీక్కుతింటున్నది.

మూడవ సారి పిలిచిన పిలుపుకు ఆమె తుళ్లిపడి లేచింది. మంచి నిద్ర మధ్యలో లేవడం వల్ల, ఆమె కళ్లు ఎర్రగా జ్యోతుల్లాగా ఉన్నాయి. ఇసుక పోసినట్లు గరగరలాడుతూ మండుతున్నాయి. ఆమె అవేవీ పట్టించు కోకుండా భర్త దగ్గరకు వచ్చింది.

"ఏమండీ మంచినీళ్లు కావాలా? ఏమన్నా బాధగా ఉన్నదా? ఆయన చేతి మీద చెయ్యివేసి ఆప్యాయంగా అడిగింది.

ఆ ఆప్యాయతకు ఆయనకు కళ్ల వెంట నీళ్లు తిరిగాయి.

ఆమెకు కంగారు ఎక్కువైంది. "చెప్పండి... సిస్టర్‌ను పిలవనా?" అడిగింది పార్వతి.

ఆయన చిన్నగా నవ్వాడు. "బాధేమీ లేదు" అన్నాడు.

"మరి...?" ఆశ్చర్యంగా చూసింది పార్వతి.

"నీతో మాట్లాడదామని" అన్నాడు నిదానంగా.

"ఈ అర్ధరాత్రి మాటలేమిటండీ? పడుకోండి. నాకూ నిద్ర వస్తోంది" అన్నది పార్వతి చాప మీదకు ఒరగబోతూ.

"ప్లీజ్ పార్వతీ... ప్లీజ్ కొద్దిసేపు నా దగ్గర కూర్చోవా...?" జాలి కొల్పుతున్నట్లు ఆయన అడిగిన తీరుకు ఆమెకూ కళ్లు చెమర్చాయి. పమిట కొంగుతో కళ్లు అద్దుకుని, నెమ్మదిగా ఆయన్ను పక్కకు జరిపి, మంచం అంచుకు కూర్చున్నది. ఆయన చేతిని తన చేతిలోకి తీసుకుని, "చెప్పండి" అన్నది, ఆయన ముఖంలోకి చూస్తూ.

ముఖం పీక్కుపోయి, కళ్లు లోతుకి పోయి, గడ్డం పెరిగి ఒకింత భయంకరంగా ఉన్నది ఒకప్పటి అందమైన ఆ ముఖం.

"ఇవాల్టికి ఎన్ని రోజులైంది యాక్సిడెంట్ జరిగి...?"

"నెలా పదిహేను రోజులు..."

"ఎన్ని ఆపరేషన్లు అయ్యాయి...?"

"అదేమిటండీ తెలియనట్లు అడుగుతారూ... చెవి పక్కన ఒకటీ, గడ్డానికి ఒకటీ, పొత్తి కడుపులో ఒకటీ-మొత్తం మూడు అయ్యాయిగా..."

"ఇప్పటికి ఎంత డబ్బు ఖర్చు అయింది...?"

"ఇప్పుడెందుకండీ ఆ గోలంతా...అర్ధరాత్రి అంకమ్మ శివాలు అన్నట్లు, అయినా అవన్నీ అబ్బాయే చూసుకుంటున్నాడు. నాకు తెలియదు, నిద్ర వస్తోంది. పడుకుంటాను."

"బుకాయించకు పార్వతీ! నీకంతా తెలుసని నాకు తెలుసు.

చెప్పు పార్వతీ!" అన్నాడు రామూర్తి.

"ఆ ఆలోచనలన్నీ మీకెందుకండీ? మనసు ప్రశాంతంగా ఉంచుకుంటే త్వరగా కోలుకుంటారని డాక్టరు గారు చెప్పారా లేదా?"

"ఇక నాకు అంతా ప్రశాంతమే కానీ, ఇప్పటికి ఒక యాభైవేలో, అరవయ్యో అయ్యాయి కదూ?"

"లేదండీ. ఈ డాక్టరు డబ్బు మనిషి కాదు, ధర్మప్రభువు. ఓ పాతికో ఎంతో అయ్యింటాయి" అయిన ఖర్చులో మూడో వంతు చెప్పింది పార్వతి.

"కాదులే, నేను బాధ పడ్తానని నువ్వు దాస్తున్నావు. అంటే కట్నం డబ్బులో సగం దాకా అయిపోయాన్న మాట. మళ్లీ అంత డబ్బు మనం ఎప్పటికి కూడ బెడ్తాము? అమ్మాయి పెళ్లి ఎప్పుడు చేస్తాము పార్వతీ? నాకిక మందులూ, ఆపరేషనూ ఏమీ ఒద్దు పార్వతీ... పిల్లలకు చెప్పి ఒప్పించవూ?" ఆయన గొంతు గాద్గదికమైంది.

"అదే వద్దంది. అన్నీ ఆలోచిస్తూ మనసు పాడు చేసుకుంటుంటే మీరెప్పటికీ కోలుకుంటారు? ఎప్పటికి ఇంటికి వస్తారు? అన్నిటికీ ఆ భగవంతుడే ఉన్నాడు. అన్నీ ఆయనే చూసుకుంటా డు. మీరు ప్రశాంతంగా పడుకోండి. నాకు విపరీతంగా నిద్ర వస్తోంది. పడుకోనివ్వండి బాబూ...!" అంటూ చాప మీద వాలి పోయింది పార్వతి, ఇంకా అలాగే కూర్చుంటే, ఆయన అలాగే చెప్పి బాధ పడ్తుంటాడు అనుకుని.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం- ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**

పార్వతి అంతగా చెప్పినా ఆయనకు ఆలోచనల దయ్యం వదలలేదు. నిద్రాదేవీ కరుణించలేదు. అతికష్టమ్మీద కొద్దిగా పక్కకు తిరిగి, భార్య ముఖంలోకి చూస్తూ పడుకున్నాడు. కళనంతా తనలోనే దాచుకున్నట్లుండే ఆ ముఖం, ఇప్పుడు కళా విహీనమైపోయింది.

ఆ రూమ్‌లో ఇంకా ఐదు బెడ్లు ఉన్నాయి. ధనవంతుల జీవితాలు రకరకాలుగా ఉంటాయేమో కానీ, పేదవారివి ఒకే రకం, సమస్యలు ఎటెటో తిరిగినా, చివరకు డబ్బు దగ్గరే కేంద్రీకృతమవుతాయి. ఒకరి బాధలు ఒకరు విని, సానుభూతి చూపించడమే తప్ప, సాయం చేసుకోలేరు వారు.

000

రామూర్తి బట్టల కొట్లో సీనియర్ ఎక్కౌంటెంట్. ఆయన పెద్దలు ఆయనకు రెక్కలు తప్ప, ఆస్తులు ఇవ్వలేదు. ఇద్దరు పిల్లలు. నరేంద్ర, జ్యోతి. భార్య అనుకూలవతి. పిల్లలు బుద్ధి మంతులు. కనుకనే ఈ కరవు రోజుల్లో కూడా కొద్ది జీతమైనా, చీకూ చింతా లేకుండా బతుకు బండి లాక్కు వస్తున్నాడు ఆయన. నరేంద్ర పీజీ చేసి, నిరుద్యోగసంఘంలో సభ్యుడవలేక, ఒక

న బ్బ్వల


కంపెనీ ఏజెంటు దగ్గర గుమాస్తాగా చేరాడు. జ్యోతి డిగ్రీ చేసి, ఒక ప్రైవేట్ ట్రాన్స్ పోర్టు కంపెనీలో కంప్యూటర్ పని చేస్తున్నది. ముగ్గురివీ చాలీచాలని జీతాలు. బొటాబొటీ జీవితాలు. అటువంటి కటుపరిస్థితుల్లోనూ పార్వతి కొంత సొమ్ము పొదుపు చేసి, చీటీలు కట్టి కూతురి పెళ్లికని దాచింది. అదృష్టవశాత్తూ మంచి సంబంధం కుదిరింది. లగ్నాలూ పెట్టుకున్నారు. పార్వతి దాచిన సొమ్ము, రామూర్తిగారి యాక్సిడెంట్ రూపంలో ఖర్చవుతోంది.

రామూర్తి ఆలోచనాసాగరంలో పడి కొట్టుకు పోతున్నాడు. దానికి ఒడ్డు అనేది కన్పించడం లేదు. ఇప్పటికి అయిన మూడు ఆపరేషన్లు కాక, వెన్నుపూసకు మరొకటి చెయ్యాలట... దాని కోసం ఏదో ఊరి నుండి పెద్ద డాక్టరు గారు రావాలట.... ఖర్చు చాలా అయినా, నేను లేచి తిరగడానికి వన్ పర్సేంటే ఛాన్సట. అదృష్టం మీద ఆధారమట... మొన్న నేను స్పృహలో లేను అనుకుని, వాళ్లు అనుకున్న మాటలు నాకు వినబడ్డాయి.

అమ్మాయికి పెళ్లి పెట్టుకున్నాము అనగానే, ముగ్గురు షావుకార్లూ మంచివాళ్లు కనక తలా పదివేలూ సర్దారు. వియ్యాల వారు కట్నంలో కొంత సొమ్ము ముందుగా కావాలని కోరితే, ఇవ్వడానికని వెళ్లాడు తాను. తిరిగి వచ్చేటప్పుడు లారీ వాడొకడు తమ ఆటోని గుద్ది, పరారయ్యాడు. నడిరోడ్డు మీద రక్తపుమడుగులో తనూ, ఆటో డ్రైవరూ పడిపోతే, దయ గలవారు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. పార్వతికి ఎలాగో విషయం తెలిసి, పరుగున వచ్చింది. నాలుగు రోజుల తరువాత, తనను శ్రేయోభిలాషుల సలహాల మీద చిన్న ప్రైవేటు ఆసుపత్రికి మార్చారు.

మిగతా ముగ్గురు ప్రయాణికులూ దిగిపోయారు. మరో పది నిముషాల్లో ఇల్లు చేరుతామనగా ఘోరం జరిగింది. పాపం, ఆ ఆటో డ్రైవరు పరిస్థితి మరీ అన్యాయం. ఆటో పూర్తిగా పచ్చడై పోయిందట. అతను కూడా ఉన్నాడో పోయాడో పాపం...!

తన సంగతి డాక్టరు గారేమన్నారు? వెన్నెముకకి ఆపరేషను అయినా, నేను లేచి తిరగడానికి అదృష్టం కావాలన్నారు గదూ, అసలు ఆ అదృష్టమనేది ఉంటే ఈ యాక్సిడెంటు ఎందుకు జరుగుతుంది? ఒకవేళ జరిగినా, ఆ స్పాట్‌లోనే నా ప్రాణం పోయి ఉంటే ఎంత బాగుండేది! అందరికీ ఇన్ని బాధలు తప్పేవి కదా. చనిపోతే కొన్నాళ్లు ఏడ్చి



ఊరుకునేవారు.

ఇప్పుడు పార్వతి 24 గంటలూ తననంటి పెట్టుకునే ఉంటోంది. పాపం, పిల్లలే తెల్లవారు జామునే లేచి, అన్ని పనులూ చేసుకుని, వంట చేసి, వాళ్లు తిని నాకూ, వాళ్లమ్మకూ క్యారియరే తెస్తున్నారు. నాతో కొద్ది సేపు మాట్లాడి వాళ్ల పనుల్లో కెళ్తున్నారు. అసలే చాకిరితో సతమతమయ్యేవాళ్లకి ఇది అదనపు పని...

"నాకు తెలుసు... కట్నం కోసం దాచిన డబ్బంతా తన

వైద్యానికి తగలేసినా, ఇంకా అప్పు చేసి ఖర్చు పెట్టినా, నేను పూర్తిగా కోలుకోలేను. పూర్వం వలె ఉద్యోగం చెయ్యలేను. డబ్బు సంపాదించలేను. వాళ్ల ప్రాణాలకు గుదిబండగా మారడం తప్ప, ఇక నా బతుక్కు ఏ సార్థకమూ లేదు. తనది మూడు వంతులు అయిపోయిన జీవితం. పిల్లలకు ముప్పాతిక బతుకు ముందు ఉంది. నా కోసం అంత డబ్బు ఖర్చు పెట్టి, అమ్మాయి పెళ్లి లేకుండా జీవితాంతమూ ఉండి పోవాలా...?

డాక్టరు గారు ఒక్క శాతం అవకాశమేనని చెప్పినా ఉన్నదంతా ఊడ్చి ఆపరేషను చేయించడానికే వాళ్లు ముగ్గురూ సిద్ధపడ్డారు. అటువంటి భార్య, పిల్లలూ ఉన్నందుకు నేను నిజంగా చాలా అదృష్టవంతుణ్నే. కానీ, ఆ ఒక్క శాతం కూడా చేజారితే, చేసిన కష్టం, పెట్టిన ఖర్చూ అంతా అంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. ఇంత చేసినా, నేను పూర్వపుమనిషి నవలేను. కనీసం నా పనులు కూడా నేను చేసుకోలేను. ఇంక ఎందుకీ వ్యర్థపు బతుకు...? జీవచ్ఛవం లాగానో, జీవమున్న కట్టెలాగానో నేను జీవించలేను. ఏదో దేశంలో మెర్సీ కిల్లింగ్‌ను చట్టబద్ధం చేశారట పుణ్యాత్ములు! మన దేశంలో కూడా ఆ చట్టం వస్తే ఎంత బాగుండు...!

నాకింక ఏ మందులూ మాకులూ వద్దు. ఆపరేషన్లు అసలే వద్దు. ఇలా ఇంటికి తీసుకెళ్లి పొండి. ఊపిరి ఉన్నన్నాళ్లే బతుకు తాను... అని చెప్పాలి ముగ్గురికీ. వాళ్లు ఒప్పుకోరు. ముమ్మాటికీ ఒప్పుకోరు... ఎలా వాళ్లని ఒప్పించడం...?

హే భగవాన్... ఎందుకు నాకీ విషమపరీక్ష? ఒకరి మీద ఒకరికి ప్రేమ లేకుంటే బాధ పడతారు అందరూ. ప్రేమలు ఎక్కువైతే కూడా బాధలుంటాయని ఎందరికి తెలుసు...?

రామ్మూర్తి గారు ఆలోచనల్లో ఉండగానే తెల్లవారింది. కష్టమైనా, సుఖమైనా బతుకు సాగించక తప్పదు కనుక, ఎవరి పనుల్లో వాళ్లు పడ్డారు. పార్వతి తను బ్రష్ చేసుకువచ్చి, రామ్మూర్తి గారికీ చేయించింది. సిస్టర్‌ను బతిమాలి కొద్దిగా వేడి నీళ్లు తీసుకుని, బట్ట తడిపి ఆయన ఒళ్లంతా తుడిచి, ఉతికిన బట్టలు తొడిగింది. పక్కనున్న హోటల్ నుండి ఇడ్లీ, కాఫీ తెచ్చింది.

"ముందు నువ్వు తిను పార్వతీ, చాలా నీరసంగా ఉన్నావు."

"కాదు, మీకు పెట్టాక తింటాను" అంటూ ఇడ్లీ తుంచి నోట్లో పెడుతుంటే, ఆయన కళ్లు నీటితో నిండి పోయాయి. "ఎన్నాళ్లు నాకీ విధంగా చాకిరీ చేస్తావు పార్వతీ...?" ఆయన గొంతు వణికింది.

"ఎన్నాళ్లో ఎందుకు? వెన్నుకి ఆపరేషను అయిపోతే, పది రోజుల్లో మీరు లేచి తిరగరూ? నాకు దొరకమన్నా దొరుకుతారూ?"

**మరో పది నిముషాల్లో ఇల్లు చేరుతామనగా ఘోరం జరిగింది. పాపం, ఆ ఆటో డ్రైవరు పరిస్థితి మరీ అన్యాయం. ఆటో పూర్తిగా పచ్చడై పోయిందట. అతను కూడా ఉన్నాడో పోయాడో పాపం...! తన సంగతి డాక్టరు గారేమన్నారు? వెన్నెముకకి ఆపరేషను అయినా, నేను లేచి తిరగడానికి అదృష్టం కావాలన్నారు గదూ, అసలు ఆ అదృష్టమనేది ఉంటే ఈ యాక్సిడెంటు ఎందుకు జరుగుతుంది? ఒకవేళ జరిగినా, ఆ స్పాట్‌లోనే నా ప్రాణం పోయి ఉంటే ఎంత బాగుండేది! అందరికీ ఇన్ని బాధలు తప్పేవి కదా. చనిపోతే కొన్నాళ్లు ఏడ్చి ఊరుకునేవారు.**

శుష్కహాసం చేశాడు రామ్మూర్తి. "అవన్నీ ఒట్టి మాటలు. పార్వతీ, నన్ను మాయపుచ్చలేరు. పిల్లలు నా మాట వినరు. నువ్వైనా వాళ్లకు నచ్చ చెప్పి ఒప్పించవూ?"

"అబ్బబ్బ... మళ్లీ మొదలు పెట్టారూ? ఇలా అయితే నేను మీ దగ్గర అసలు ఉండను. ఇప్పుడే వెళ్లిపోతాను."

"పిచ్చిదానా... నువ్వు వెళ్లాలన్నా వెళ్లలేవు. మన బంధం ఎంత గట్టిదో నాకు తెలియదూ?"

"మరి, అన్నీ తెలిసేనా... అలా తిక్కతిక్కగా మాట్లాడుతారూ... ఒక వేళ నాకే గనుక ఇలా అయితే, మీరు ఆపరేషన్లు చేయించ కుండా వదిలేసేవారా...?"

"వద్దు పార్వతీ... వద్దు... ఇటువంటి బాధలు పగవాడి క్కూడా రాకూడదు..."

"ఏం నాన్నా... ఈ వేళ ఎలా ఉంది మీ ఒంట్లో?" అప్పుడే వచ్చిన జ్యోతి, నరేంద్ర అడిగారు.

"ఎలా ఉండటమేమిట్రా బాబూ... నన్ను తినేస్తున్నారు. మందులు వద్దట, ఆపరేషను అసలే వద్దట, ఆపరేషను చేయిస్తే కట్నం డబ్బంతా అయిపోయి, దాని పెళ్లి ఆగి పోతుందట, ఒకటే గోల అనుకో రాత్రి నుంచీ..." పార్వతి తన మనసులో బాధంతా వెళ్లగక్కింది.

"ఏం నాన్నా అలా అన్నారా? నాకు మీకంటే పెళ్లి ముఖ్యమనుకున్నారా? మీరింత బాధలో ఉంటే, నేను పెళ్లి చేసుకుని సుఖపడగలననుకున్నారా? ఎప్పటికీ అలా ఆలోచించ వద్దు నాన్నా!" జ్యోతి మంచానికి తల ఆనించి బావురుమంది.

అది చూసి, ముగ్గురికీ కళ్లు చెమర్చాయి.

"పెళ్లి ముఖ్యమే కానీ, అదే జీవితం కాదు నాన్నా. మీరు చక్కగా కోలుకుంటే, కొన్నాళ్లకైనా దాని పెళ్లి చెయ్యలేకపోము. అలా దిగులుపడకండి నాన్నా!" అన్నాడు నరేంద్ర, ఆయన చేతి మీద నిమురుతూ.

"డబ్బు... డబ్బు... బతకడానికి డబ్బు ప్రధానమే గానీ, అన్ని అవసరాలనూ అదే తీర్చలేదు నాన్నా. సుఖశాంతులనూ ఇవ్వలేదు. ఇవ్వగలిగినట్లైతే లోకంలోని ధనవంతులంతా ఏ కష్టాలూ, బాధలూ లేకుండా సుఖంగా ఉండాలిగా. లేరు కదా. ఎంత కోటీశ్వరుడైనా, మనిషికి మనిషి ఆలంబన కావాలి నాన్నా... మనసుకి మనసే ఆలంబన కావాలి. ముఖ్యంగా మాకు మీరు కావాలి నాన్నా. ఇంకెప్పుడూ ఇలా బాధపడనని మాట ఇవ్వండి" చెయ్యి చాపాడు నరేంద్ర.

ఆ చేతికి తోడుగా మరో రెండు చేతులు ఆయన ముందుకు వచ్చాయి.

రామ్మూర్తి తడి కళ్లతో నిండుగా నవ్వాడు.

●